ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
22-09-2024
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 21 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## హైదరాబాద్ కు రాష్ట్రపతి

సెప్టెంబర్ 28వ తేదీన తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఖరారు



2 లో

## మహనీయుడికి నివాళి

స్వాతంత్ర్యసమర యోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో బాపూజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారని, వారి స్ఫూర్తిని ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు.



## సీతారాం ఏచూరి లాంటి వ్యక్తులు చాలా అరుదు

- భారత రాజకీయ అవని పై స్వచ్ఛమైన ప్రజల మనిషి సీతారాం ఏచూరి...
- నమ్మిన సిద్ధాంతమే ఆయన ఊపిరి...
- సీతారాం గారు భౌతికంగా మన మధ్య లేకపోయినా...
- ఆ ఊపిరి ఆగిపోకూడదు...
- ఆయన ఆశయం ఓడిపోకూడదు...
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




2 లో



# తెలంగాణకు ప్రపంచబ్యాంక్ సహకారం

**అభివృద్ధి విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రపంచబ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలోని బృందం భేటీ అయింది.**

**జయభేరి, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి గత నెలలో అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాతో సమావేశం కాగా, తదుపరి చర్చల కోసం మార్టిన్ రైజర్ బృందం హైదరాబాద్ వచ్చింది. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా, వైద్య, సాగు నీటి రంగాలను తమ ప్రభుత్వ ప్రాధాన్యాలుగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఆయా రంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. విద్యా, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత బాగుందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని మార్టిన్ రైజర్ ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ఏ రంగాలను ప్రాధాన్య అంశాలుగా ఎంచుకుందో అవే తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి పలు విభాగాల ఉన్నతాధికారులు, వరల్డ్ బ్యాంక్ కంట్రీ ఆపరేషన్ హెడ్ పాల్ ప్రోసీ, అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రాజెక్ట్ లీడ్ నటాలియా కే, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమా పత్ రే, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

# అమెరికా చేరుకున్న ప్రధాని



**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** మూడు రోజుల పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా చేరుకున్నారు. న్యూయార్క్‌లోని క్వాడ్ సమ్మిట్‌లో ప్రధాని పాల్గొననున్నారు. మోదీ పర్యటనను ఎన్నారైలు ఓ పండుగలా భావిస్తున్నారు. హిస్టారికల్ ఈవెంట్‌స్‌ను గుర్తు చేసుకుంటూ మోదీకి ఘన స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల మోడ్‌లో ఉన్న అమెరికాలో భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన ఆసక్తికరంగా మారింది. అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్‌తో కలిసి డెలావర్‌లో నిర్వహించే నాల్గవ క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొంటారు ప్రధాని మోదీ. ఇండోపసిఫిక్ దేశాల అభివృద్ధి, పరస్పర సహకారం పై సమీక్ష సహా వచ్చే ఏడాది క్వాడ్ సమ్మిట్ అజెండాపై ప్రధానంగా చర్చిస్తారు. నాల్గో క్వాడ్ సమ్మిట్ నిజానికి భారత్‌లో జరగాల్సి ఉంది కానీ అమెరికా విజ్ఞప్తి మేరకు ఐదో క్వాడ్ సమ్మిట్‌కు వచ్చే ఏడాది భారత్ వేదిక కాబోతోంది.ప్రధాని మోదీ అమెరికా పర్యటనతో ఎన్నారైల ఆనందానికి ఆకాశమే హద్దుగా మారింది. 22న న్యూయార్క్‌లో ఎన్నారైలతో సమావేశమవుతారాయన.

...మిగతాది 2 లో

# మౌనంగానే వ్యూహ రచన చేస్తున్న కేసీఆర్



**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 21:** అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత.. తుంటి ఎముకకు గాయం కావడం ఆయణ్ని మరింత నీరసించేలా చేసింది. ఎంపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా... ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌కు తొలిరోజు హాజరైనా... ఆయన మునుపటిలా యాక్టివ్‌గా లేరు. తన వ్యవసాయ క్షేత్రంలోనే సేద తీరుతున్న కేసీఆర్, అడపాదడపా పార్టీ నేతలను కలుస్తున్నారు. కానీ, రాజకీయంగా ఆయన బయటకు వచ్చి చాలా రోజులైంది. ఇప్పుడిదే అంశం.. గులాబీ శ్రేణులను, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు నిరుత్సాహపరుస్తోంది.ఇన్నాళ్లూ ఎలా ఉన్నా... ఇప్పుడు తెలంగాణ రాజకీయం మరోసారి రగులుతోంది. అధికారపక్షంతో నువ్వా? నేనా? అన్నట్టుగా తలపడుతోంది ప్రతిపక్ష బీఆర్ఎస్. ఎమ్మెల్యేల ఫిరాయింపుల నుంచి, పీఏసీ చైర్మన్ పదవి వివాదాస్పదం అవడం దాకా... రుణమాఫీ నుంచి సెక్రటేరియట్ ముందు

...మిగతాది 2 లో

# హైడ్రా ఇక కూల్చుడే...

## ఇప్పటికే పూర్తయిన మార్కింగ్

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 21:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు చట్టబద్ధతపై అనేక సందేహాలు ఉన్నాయి. కోర్టుల్లో పిటిషన్ల కూడా దాఖలయ్యాయి. దీంతో హైడ్రా దూకుడు తగ్గింది. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం సందర్భం వచ్చినప్పుడల్లా హైడ్రా ఏం చేయబోతుందో చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చేందుకు కేబినెట్లో నిర్ణయం తీసుకున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించడం ద్వారా పూర్తి స్థాయి చట్టబద్ధ సంస్థగా మారనుంది. హైదరాబాద్‌లో చెరువులు, కాల్వలు, కుంటల ఆక్రమణలను తొలగించటని హైడ్రా ప్రదాన ఉద్దేశం. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఆయా శాఖలకు అప్పగించటంతో పాటు మళ్ళీ ఆక్రమణలు జరగకుండా జలవనరులను కాపాడేందుకు ముఖ్యమంత్రి రేంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేయటం ద్వారా హైడ్రాను ఏర్పాటు చేశారు. అయితే హైడ్రా ఏర్పాటు

...మిగతాది 2 లో





## అమృత్ టెండర్లలో భారీ అవినీతి

అమృత్ టెండర్లలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చాలి... కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్:** అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబీకుల అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాక్ష్యాలను బయటపెట్టారు. అమృత్ టెండర్లలో

## ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు

▸▸ సీఎం చంద్రబాబు నాయుడు



**జయభేరి, ప్రకాశం జిల్లా/మద్దిరాలపాడు :** ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందాలి...ప్రతి కుటుంబానికి సంక్షేమం అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రకాశం జిల్లా, మద్దిరాలపాడు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. గత పాలకుల దోపిడీ, దౌర్జన్యాలు, దుర్మార్గాలతో గాడితప్పిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెట్టేందుకు యజ్ఞంలా పని

...మిగతాది 2 లో




## కలకలం రేపుతున్న వాకీటాకీల పేలుళ్లు

▸▸ కేరళ, లెబనాన్ లో మూలాలు

**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** లెబనాన్‌లో ఏకకాలంలో పేజర్లు పేలి 12 మంది మృతి చెందగా, వేల సంఖ్యలో తీవ్రగాయాలుపాలైన ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ పేలుళ్ల వెనుక ఇజ్రాయిల్ దేశ నిఘా సంస్థ 'మొస్సాద్'

...మిగతాది 2 లో

## ప్రజలకు భారం కానున్న కరెంట్



**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 21:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఫ్రీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్ అమలు చేస్తోంది. రుణ మాఫీ చేసింది. దసరాకు రైతుభరోసా ఇచ్చే ఆలోచనలో ఉంది. అయితే తొలిసారి ప్రజలకు షాక్ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. విద్యుత్ చార్జీలు పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.తెలంగాణలో విద్యుత్ చార్జీలు పెరుగుతాయా అంటే అవుననే

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## అమెరికా చేరుకున్న ప్రధాని

నసావు వెటరన్స్ మెమోరియల్ కొలీజియంలో ఇప్పటికే అద్భుత ఏర్పాట్లను చేశారు. ప్రధాని మోదీకి ఆత్మీయ స్వాగతం పలికేందుకు ఎన్నారైలు భారీ సన్నాహాలు చేస్తున్నారు. తమ మన్ కీ బాత్ షేర్ చేసుకునేందుకు దాదాపు 24 వేల మంది ఈ సమావేశానికి హాజరు కాబోతున్నారు.ఇక 23వ తేదీన న్యూయార్క్ వేదికగా ఐక్య రాజ్య సమతి ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మిట్ ఆఫ్ ఫ్యూచర్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. హ్యాట్రిక్ విక్టరీతో ఇంట రికార్డు క్రియేట్ చేసిన మోదీ..అంతకన్నా ముందే అమెరికాలోనూ తన మార్క్ చాటుకున్నారు. అందుకు ఎన్నారైలా ఆవాజే నిదర్శనం. 1997లో అమెరికాలో పర్యటించిన సమయంలో ఆయన బ్యాగ్‌ను ఎవరో కొట్టేశారు. పాస్ పోర్ట్, మనీ అందులోనే ఉండిపోయాయి. అయినా ఆయన ఏమాత్రం కలత చెందలేదు. చాలా నిబ్బరంగా వున్నారని ఆనాటిని ఘటనను గుర్తు చేసుకున్నారు ఎన్నారై హిరుభాయ్ పటేల్.ఇక యంగ్ పార్లమెంటీరియన్‌గా అమెరికా ఆహ్వానం మేరకు అప్పట్లో న్యూజెర్సీలో పర్యటించారు మోదీ. ఆయన ప్రసంగం మరో వివేకానందుడిని తలపించిందన్నారు ఎన్నారై లు జ్యోతింద్ర మెహతా, హష్‌ముఖ్ పటేల్. ఆలోచనలో స్పష్టత.. భావప్రకటన అబ్బురపరిచాయన్నారు. ఇలా ఎన్నారైలే కాదు ఇప్పుడు అగ్రదేశం అగ్రనేతల మన్ కీ దృష్టి మన మోదీజీనే. క్వాడ్ సమ్మిట్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ ద్వైపాక్షిక సంబంధంలో కీలకం కాబోతుంది. ఇక మోదీతో భేటీ అవుతానంటూ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

## హైడ్రా ఇక కూల్చుడే...

చట్టబద్ధంగా లేదు కాబట్టి.. నోటీసులు ఇవ్వడం. కూల్చి వేయడానికి అధికారాలు ఉండవని వాదిస్తూ వస్తున్నారు. కోర్టుల్లో కూడా కేసులు పడటంతో తాత్కలికంగా హైడ్రా దూకుడు తగ్గింది. చట్టబద్ధత కల్పించే దిశగా.. శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. క్యాబినెట్ తీర్మానం అయినంత మాత్రాన హైడ్రాకు చట్టబద్ధత వచ్చినట్లు కాదని చెప్పుకోవచ్చు. చట్టం చేస్తేనే చట్టబద్ధత ఉన్నట్లు. చట్టబద్ధత ఇవ్వటానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకోవాలి. ఇప్పుడు కేబినెట్ నిర్ణయం తీసుకుంది కాబట్టి తదుపరి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి పాస్ చేస్తుంది. ఆ తర్వాత గవర్నర్ గెజిట్ జారీ చేస్తే హైడ్రాక తిరుగు ఉందు. ఒకవేళ సమావేశాల నిర్వహణ ఆలస్యమైతే ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం ఉంది. హైడ్రాకు ప్రభుత్వం చాలా కీలకమైన బాధ్యతలను ఇస్తోంది. మూసీ నది ప్రక్షాళన, చెరువులు, కాల్వలతో పాటు కుంటలను ఆక్రమించిన మరిన్ని నిర్మాణాలను తొలగించాల్సిన మిషన్ హైడ్రాకు ఇస్తోంది. హైడ్రాకు 169 మంది సిబ్బందిని ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే హైడ్రా చెరువులకు సంబంధించి పూర్తి సమాచరాంతో మార్కింగ్ చేసుంది. ప్రభుత్వ భూములు , ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలన్నింటినీ వరుసగా కూల్చిచేయనున్నారు. కూల్చి వేసిన వాటిని తొలగించడానికి ప్రత్యేకంగా టెండర్లు పిలుస్తున్నారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్ కూడా ఉంటుంది. అంటే ఇక నోటీసులు.. కేసులు.. కూడా హైడ్రా నమోదు చేయగలదు. అందుకే.. వచ్చే కొద్ది రోజుల్లో హైడ్రా తన మార్క్‌ను హైదరాబాద్ చుట్టూ చూపిస్తుందని భావిస్తున్నారు.

## మౌనంగానే వ్యూహ రచన..

రాజీవ్ విగ్రహ ఏర్పాటు దాకా... కాంగ్రెస్‌ను కడిగిపారేసే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు.కౌశిక్‌రెడ్డి ఇంటిపైదాడి ఎపిసోడ్‌తో..వ్యవహారం మరింత పీక్స్‌కు చేరింది. అంశం ఏదైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుడుగునా ఇరకాటంలో పెట్టేందుకు... ప్రజల ముందు దోషిగా నిలబెట్టేందుకు..ప్రయత్నం చేస్తున్నారు హరీష్‌రావు, కేటీఆర్. వరుస ఆందోళనలతో కాంగ్రెస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.పెద్దసార్ స్పందించడం లేదేంటన్నదే అందరినీ తొలిచి వేస్తున్న ప్రశ్న. 14ఏళ్లు ఉద్యమాన్ని నడిపిన నాయకుడు.. 10ఏళ్లు రాష్ట్రాన్ని ఏలిన నాయకుడు.. ఇప్పుడిలా మౌనవ్రతంలోకి వెళ్లడం పార్టీవర్గాలనే కాదు, సామాన్య ప్రజలను కూడా ఆశ్చర్య పరుస్తోంది. అంశమేదైనా కేసీఆర్ అంటేనే ఫైర్... అన్నట్టుగా ఉంటుంది ఆయన వ్యవహార శైలి. కానీ, ఇప్పుడిలా కామ్‌గా ఉండిపోవడం ఆయన అభిమానులకు అస్సలు నచ్చట్లేదు. అధికారం ఉంటేనే వస్తారా? లేదంటే జనాలు అక్కర్లేదా? అనే వారూ ఉన్నారు.పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్‌నేతలకు తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనుకుంటున్న కేసీఆర్... ఆ బాధ్యతను కేటీఆర్,హరీష్‌లకు అప్పగించారట. అందుకే,సీఎం రేవంత్ విమర్శలు, ఆరోపణలు చేయడమే గాని, కేసీఆర్ నుంచి ఇప్పటివరకూ ఒక్క కౌంటర్ కూడా రాలేదు. ఇక, పార్టీని గాడిన పెట్టే బాధ్యతను కూడా హరీష్, కేటీఆర్‌లకే వదిలేసిన కేసీఆర్... వారి సత్తాకు పరీక్ష పెడుతున్నారనే చర్చ కూడా జరుగుతోంది. అందుకే, ఎవరికివారు పోటాపోటీగా ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ ముందుకెళ్తున్న బావబామ్మర్దులు కేసీఆర్ టాస్క్‌ను పూర్తిచేసే పనిలోనే ఉన్నారట.అసలు, ప్రస్తుతం కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం కూడా...కేసీఆర్ దిశానిర్దేశంలోనే జరుగుతోందిట. అధినేత ఎలా చెబితే అలా ముందుకెళ్తూ... రాజకీయాల్ని వేడెక్కిస్తున్నారట బీఆర్ఎస్ నేతలు. ఈ లెక్కన లోపల ఉంటూనే ఇంత రచ్చ చేస్తున్న కేసీఆర్.. ఒకవేళ నిజంగానే బయటకు వస్తే.. కాంగ్రెస్ వాళ్లు తట్టుకుంటారా? అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి గులాబీశ్రేణులు. అంతేకాదు, అధినేత మౌనం వెనక పెద్ద వ్యూహం లేకపోలేదని కూడా అంచనా వేసుకుంటున్నాయి. కచ్చితంగా భారీ పొలిటికల్ స్కెచ్‌తోనే.. ఆయన సైలెన్స్ మెయింటెన్ చేస్తున్నారనీ.. దాంతో భారీ విస్ఫోటనం తప్పకపోవచ్చనే ధీమానూ వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు

చేస్తున్నామని, నిండు మనసుతో ప్రజలు ఆశీర్వదిస్తే రాష్ట్రాన్ని నెంబర్ 1గా చేసి చూపుతానని అన్నారు. అక్టోబర్ నెలంతా గ్రామసభల ద్వారా అర్హులకు పింఛన్లు, కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10శాతం రిజర్వేషన్ ఇస్తామని అన్నారు.తప్పులు చేసి ఎదురుదాడి చేస్తే చూస్తూ ఊరుకోం...చర్యలకు వెనుకాడం.వెంకన్న లడ్డూలో కల్తీ నెయ్యి వాడారు....తిరుమల పవిత్రతను పూర్తిగా దెబ్బతీశారు. కల్తీ నెయ్యితో దేవుడికి నైవేద్యం పెట్టి...తప్పు చేయలేదని బుకాయింపా? గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం...సుపరిపాలనకోసం యజ్ఞంలా పని చేస్తున్నాం.శాఖలపై సమీక్షలు చేస్తుంటే గత ప్రభుత్వ విధ్వంసంపై షాకింగ్ నిజాలు బయటపడుతున్నాయని అన్నారు.

## కలకలం.. వాకీటాకీల పేలుళ్లు

హస్తం ఉందని లెబనాన్ ఆరోపిస్తోంది. పేజర్లు పేలిన ఘటన నుంచి ఇంకా తేరుకోక ముందే వాకీటాకీలు సైతం ఏకకాలంలో పేలి ఆ దేశాన్ని మరింత దెబ్బతీశాయి. ముఖ్యంగా ఆ దేశం కేంద్రంగా పనిచేస్తున్న 'హెజ్బొల్లా' గ్రూపు ఈ వరుస దాడులతో ఖంగుతిన్నది. ఇజ్రాయిల్ - లెబనాన్ (హెజ్బొల్లా) మధ్య యుద్ధం జరుగుతున్న ఈ సమయంలో ఈ చర్యలో నీతి, న్యాయం, ధర్మం సంగతి పక్కన పెడితే.. ఈ తరహాలో శత్రువులను దెబ్బతీయడం ప్రపంచంలో మొదటిసారిగా చోటుచేసుకుంది ఇజ్రాయిల్ ప్రజలు తమ పండుగ వేడుకల్లో మునిగి తేలుతున్న సమయంలో గాజా నుంచి 'హమాస్' ఉగ్రవాదులు విరుచుకుపడి సృష్టించిన మారణహోమం యావత్ ప్రపంచం చూసింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ చేపట్టిన కౌంటర్ ఆపరేషన్స్ అంతకు మించిన మారణహోమాన్ని సృష్టించాయి. గాజాలోని 'హమాస్' సంస్థకు భావసారూప్యత కల్గిన ఉగ్రవాద, వేర్పాటువాద సంస్థలతో సన్నిహిత సంబంధాలున్నాయి. హమాస్ తరహాలోనే లెబనాన్‌లో కూడా సాయుధ ఇస్లామిక్ గ్రూపు 'హెజ్బొల్లా' పనిచేస్తోంది. ఈ సంస్థకు ఉన్న సైనిక సంపత్తి ఒక చిన్న దేశం సైన్యంతో సమానం. ఇప్పుడు ఈ సంస్థ కూడా ఇజ్రాయిల్‌పై ఆయుధాలు ఎక్కుపెట్టింది. వరుసగా మిస్సైళ్లతో దాడులకు తెగబడింది. ఇజ్రాయిల్ రక్షణ కవచం అనేక మిస్సైళ్లను మధ్యలో ఆకాశంలోనే ధ్వంసం చేసినప్పటికీ.. కొన్ని నేలను చేరి విధ్వంసం సృష్టించాయి. అందులో ఫుట్‌బాల్ మైదానంలో మిస్సైల్ సృష్టించిన విధ్వంసంలో యువత, పసిపిల్లలు కూడా చనిపోయారు. ఈ ఘటన ఇజ్రాయిల్‌ను మరింత కోపోద్రిక్తం చేసింది. ఆ పర్యవసానమే లెబనాన్‌లో జరిగిన పేజర్, వాకీటాకీ పేలుళ్లు.లెబనాన్‌తో పొంచి ఉన్న ముప్పు నేపథ్యంలో ఇజ్రాయిల్ ఆ దేశ సాయుధ హెజ్బొల్లా గ్రూపు కార్యాకలాపాలపై తమ నిఘా కొనసాగించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నిఘా సంస్థల్లో ఒకటిగా పేరుగాంచిన ఇజ్రాయిల్ నిఘా విభాగం 'మొస్సాద్', హెజ్బొల్లా కార్యకలాపాలను పసిగడుతూ కౌంటర్ ఆపరేషన్లు చేపడుతూ వచ్చింది. పెగాసస్ వంటి అత్యంత శక్తివంతమైన నిఘా సాఫ్ట్‌వేర్ రూపకర్తలైన ఇజ్రాయిలీ దేశస్థులు సెల్‌ఫోన్లు, ఆధునిక కమ్యూనికేషన్ పరికరాలను ఉపయోగించడం తమ కదలికలను పసిగడుతున్నారని 'హెజ్బొల్లా' భావించింది. అందుకే కాలం చెల్లిన కమ్యూనికేషన్ వ్యవస్థ 'పేజర్' సేవలను మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చింది. సెల్‌ఫోన్లు రాకముందు పేజర్ల ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకునేవారు. వాటిని ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా వినియోగించడం లేదు. కంట్రోల్ సెంటర్ నుంచి ఇచ్చే సందేశం పేజర్లకు చేరుతుంది. తద్వారా మొస్సాద్ కళ్లుగప్పి తమ కార్యాకలాపాలను కొనసాగించవచ్చని హెజ్బొల్లా భావించింది.

# పార్టీ బాట పట్టనున్న మంత్రులు

## పీసీసీ చీఫ్ నిర్ణయం వెనుక పెద్ద ప్లాన్..

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 21:



ప్రజా ప్రభుత్వంగా చాటుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కార్... ఇప్పుడు పార్టీ బాట పట్టనుంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధంగా పార్టీ కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను తెలుసుకోవాలని నిర్ణయించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్.... ముఖ్యమంత్రి, మంత్రులంతా గాంధీభవన్‌కు రావాలని తాజాగా ప్రతిపాదించారు. ప్రభుత్వమంటే సచివాలయం, అసెంబ్లీ.. ముఖ్యమంత్రి, మంత్రులే కాదని ప్రభుత్వంలో పార్టీ కూడా ఓ భాగమని చెప్పాలనుకున్న పీసీసీ చీఫ్.. నెలకొకసారైనా సీఎం రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.. అదేవిధంగా మంత్రులు కూడా వారానికి రెండుసార్లు పార్టీ క్యాడర్ కష్టనష్టాలు తెలుసుకునే విధంగా గాంధీభవన్‌కు రావాలని సూచించారు. పీసీసీ చీఫ్ ప్రతిపాదనకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇకపై మంత్రులు వారం వారం గాంధీభవన్‌లో ప్రత్యక్షం కావడం తప్పనిసరిగా మారింది.వాస్తవానికి ప్రజా ప్రభుత్వంగా తొలి నుంచి చెబుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్.. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రజా భవన్‌లో ప్రజాదర్బార్‌కు శ్రీకారం చుట్టింది. తొలుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క వంటి వారు కొద్దిరోజులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమ బాధ్యతలను ఆ తర్వాత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి అప్పగించారు.ఈ కార్యక్రమం ప్రభుత్వ పరంగా నిర్వహిస్తుండగా, మంత్రులను ఇన్‌వాల్వ్ చేస్తూ... వారిని గాంధీభవన్ రప్పించే ప్లాన్ చేశారు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్. కొద్ది రోజుల క్రితం వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నా... ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. కానీ, పార్టీలో తన మార్క్ చాటుకోవాలనే ప్రయత్నంతో మహేశ్‌కుమార్ గౌడ్ కొత్త స్కీమ్‌కు తెరతీశారా? అన్న చర్చ జరుగుతోంది.పార్టీ కార్యాలయంలో మంత్రులు అందుబాటులో ఉండాలని పీసీసీ చీఫ్ నిర్ణయించడంతో సీఎం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటున్నారు. ప్రజా భవన్‌లో మంగళ, శుక్రవారాలు జరుగుతుండగా.. గాంధీభవన్‌లో బుధ, శుక్రవారాల్లో మంత్రులు అందుబాటులో ఉండేలా నిర్ణయించినట్లు చెబుతున్నారు. దీంతో మంత్రులకు విడతల వారీగా గాంధీభవన్ డ్యూటీ వేస్తారని చెబుతున్నారు.పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద ప్లానే ఉందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారంలో కొనసాగాలంటే కార్యకర్తలను ప్రోత్సహించాల్సి వుందన్న ఆలోచనే ఈ కార్యక్రమానికి ప్రేరణగా చెబుతున్నారు. ఇదే సమయంలో పక్క రాష్ట్రంలో ప్రతి రోజూ ప్రజల నుంచి మంత్రులు ఫిర్యాదులు స్వీకరిస్తుండటం కూడా కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆకర్షించిందని అంటున్నారు.మరోవైపు రాష్ట్రంలో ఎంఐఎం వంటి చిన్న పార్టీలు సైతం తమ ఎమ్మెల్యేలను పార్టీ కార్యాలయంలో కూర్చోబెట్టి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని... అందువల్లే ఎంఐఎం పార్టీ పాతబస్తీలో పాతుకుపోయిందని ప్రచారం ఉంది. ఇవన్నీ గమనించే రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రులు కూడా పార్టీ కార్యాలయానికి రావాల్సిందిగా పీసీసీ చీఫ్ ప్రతిపాదించారంటున్నారు. ఇక సీఎం కూడా ఓకే చెప్పడంతో వచ్చే వారమే ఈ కార్యక్రమం మొదలయ్యే అవకాశం ఉందంటున్నారు.ఇతర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నా... కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ ఈ కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అసలే కాంగ్రెస్‌లో నేతల తాకిడి ఎక్కువ... వారి కోరికలకు అడ్డూ అదుపు ఉండే పరిస్థితి లేదంటున్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రులను పార్టీ కార్యాలయానికి రప్పించడం ద్వారా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీలకు దీటుగా తయారు చేయాలనే ప్లాన్ కనిపిస్తున్నా... సీనియర్ నేతల తాకిడి ఎక్కువగా ఉంటే కాంగ్రెస్ పార్టీకి ఈ కార్యక్రమం సవాల్‌గానే చెబుతున్నారు. మరి ఈ సవాల్‌ను ఆ పార్టీ యంత్రాంగం ఎలా అధిగమిస్తుందనేది చూడాల్సివుంటుంది. మొత్తానికి నయా పీసీసీ చీఫ్ స్ట్రాటజీ ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# సీతారాం ఏచూరి లాంటి వ్యక్తులు చాలా అరుదు

- భారత రాజకీయ అవని పై స్వచ్ఛమైన ప్రజల మనిషి సీతారాం ఏచూరి... నమ్మిన సిద్ధాంతమే ఆయన ఊపిరి...
- సీతారాం గారు భౌతికంగా మన మధ్య లేకపోయినా...
- ఆ ఊపిరి ఆగిపోకూడదు...
- ఆయన ఆశయం ఓడిపోకూడదు...
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్:



దేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని రగిలించి..పేదల పక్షాన గళం విప్పిన సీతారాం ఏచూరి మరణం తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం జరిగిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. . ప్రజాస్వామిక వేదికల పై మన కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి. వారిని కలిసి మాట్లాడినప్పుడు కీర్తిశేషులు జైపాల్ రెడ్డి గుర్తొచ్చేవారు. దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి సమకాలికుడుగా సీతారాం ఏచూరి ఉండేవారు. నమ్మిన సిద్ధాంతం కోసమే చివరి శ్వాస వరకు నిలబడిన వ్యక్తి సీతారాం ఏచూరి. ఆయన బ్రతికి ఉన్నంత కాలం పేదల కోసం పోరాడారు.. మరణాంతరం కూడా ఉపయోగపడాలన్న కుటుంబసభ్యుల నిర్ణయం ఎంతో గొప్పది. యూపీఏ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలక బిల్లులకు మద్దతు తెలపడంలో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. రాహుల్ గాంధీ ఆయన్ను మార్గానిర్దేశకుడిగా భావిస్తారు. జమిలి ఎన్నికల ముసుగులో దేశంలో ఆధిపత్యం చేలాయించాలన్న కుట్ర జరుగుతోంది.. జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబాలించాలనుకుంటున్న ఇలాంటి కీలక సమయంలో ఆయన లేకపోవడం దేశ రాజకీయాల్లో తీరని లోటని అన్నారు. రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన ఇలాంటి సందర్భంలో ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు. మనకు దిక్సూచీలా ఉండాల్సిన సమయంలో ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం. సీతారాం ఏచూరి లాంటి వ్యక్తులు చాలా అరుదు. విద్యార్థి దశ నుంచి దేశ క్రియాశీల రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన స్ఫూర్తితో జమిలి ఎన్నికల వ్యతిరేక పోరాటంలో ముందుకు వెళ్లాలి. రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి మాట్లాడితే ప్రధాని స్పందించకపోవడం వారి ఫాసిస్టు విధానాలకు నిదర్శనం. అలాంటి భాషా ప్రయోగం చేసిన వారిని నియంత్రించకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.



# హైదరాబాద్ కు రాష్ట్రపతి

- సెప్టెంబర్ 28వ తేదీన తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పర్యటన ఖరారు

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 21:

సెప్టెంబర్ 28వ తేదీన తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పర్యటన ఖరారు అయ్యింది. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులతో సమావేశమై సమీక్షించారు. రాష్ట్రానికి తన ఒకరోజు పర్యటన సందర్భంగా తీసుకోవాలని చర్యలపై చర్చించారు, రాష్ట్రపతి ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవుతారు. అనంతరం అదే రోజు సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను రాష్ట్రపతి ముర్మ ప్రారంభిస్తారు.రాష్ట్రపతి పర్యటన సందర్భంగా శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను కోరారు. అదేవిధంగా, విమానాశ్రయం, రాష్ట్రపతి నిలయం, అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు.రాష్ట్రపతి కార్యాలయ అవసరాలకు అనుగుణంగా సహాయక సిబ్బందితో పాటు మహిళా వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతి కుమారి ఆరోగ్య శాఖ అధికారులను కోరారు. అదేవిధంగా, రాష్ట్రపతి కాన్వాయ్ ఉపయోగించాల్సిన రోడ్ల మరమ్మతులను కంటోన్మెంట్ బోర్డు, GHMC అధికారులతో సమన్వయంతో చేపట్టాలని R&B శాఖకు ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో పాములు పట్టేవారిని అందుబాటులో ఉంచాలని, అలాగే రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద, తేనెటీగలు వంటి వాటి నివారణకు ప్రత్యేక బృందాలను జీహెచ్ఎంసీ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అటవీ శాఖను ఆదేశించారు. రాష్ట్రపతి సందర్శనకు వెళ్లే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీ ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## అమృత్ టెండర్లలో భారీ అవినీతి

జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చాలంటూ నిన్ననే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులకు కేటీఆర్ లేఖ రాసారు. శనివారం నాడు కేటీఆర్ మాట్లాడుతూ అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది కంపెనీ ఎలాంటి అర్హతలు లేకున్నా దొడ్డిదారిన దక్కించుకున్న 1137 కోట్ల రూపాయల పనుల తాలూకు పత్రాలను బయటపెట్టారు. ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీని రంగంలోకి దించి టెండర్లలో తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులను రేవంత్ రెడ్డి కుటుంబం దక్కించుకుందని ఆరోపించారు. ఆ తర్వాత ఇదే కంపెనీతో తన సొంత బావమరిది సూదిని సృజన్ రెడ్డికి చెందిన శోధ కన్స్ట్రక్షన్ కంపెనీతో ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకుంది. ఇదే కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా వేలకోట్ల రూపాయల కాంట్రాక్టులు అప్పజెప్తుందని ఆరోపించారు. వాటి తాలూకు సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచకుండా చీకటి వ్యవహారాన్ని నడుపుతుందని రేవంత్ రెడ్డి పై ఆరోపణ చేసారు. అమృత్ పథకంలో ఇప్పటిదాకా జరిగిన టెండర్ల పైన పూర్తిస్థాయి విచారణ జరిపి, టెండర్లు దక్కించుకున్న ప్రతి కంపెనీ వివరాలను బయటపెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి చేసారు. తొమ్మిది నెలలుగా రాష్ట్ర లోని అవినీతి పూరిత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగిన ప్రతి టెండర్ పైన విచారణ జరిపి సమీక్ష చేసి అక్రమాలు జరిగిన ప్రతి టెండర్ ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి టెండర్ల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు కేటీఆర్.

## ప్రజలకు భారం కానున్న కరెంట్

అంటున్నాయి విద్యుత్ పంపిణీ సంస్థలు. తమకు ఇప్పటికే భారీగా లోటు ఉందని, ఈ నేపథ్యంలో చార్జీలు పెంచక తప్పదని పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో 1,200 కోట్లు పూడ్చుకోవడానికి చార్జీలు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాయి. గృహ విద్యుత్ 300 యూనిట్లు దాటితే స్థిర చార్జీ కిలోవాట్‌కు రూ.40 పెంచాలని కోరాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికను విద్యుత్ నియంత్రణ మండలికి సమర్పించాయి. మొత్త మూడు కేటగిరీల్లో విద్యుత్ చార్జీలను సవరించాలని ప్రతిపాదించాయి.తెలంగాణలో ఉత్తర, దక్షిణ డిస్కంలు ఈ ఏడాది తమ ఆదాయ, వ్యవయాల మధ్య ఉన్న లోటును వెల్లడించాయి. రెండు డిస్కంలకు కలిసి రూ.14,222 కోట్ల లోటు ఉందని అంచనా వేశాయి. ఈ మొత్తం లోటులో రూ.13,022 కోట్లను రాష్ట్రప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సమకూర్చాలని కోరాయి. అవి పోగా మిగిలిన రూ.1,200 కోట్లు చార్జీల పెంపుద్వారా పూడ్చుకోవాలని ప్రతిపాదించాయి. అయితే భారం పేద, మధ్య తరగి గృహ వినియోగదారులపై పడే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటితే.. కిలోవాట్‌కు స్థిర చార్జీ రూ.10 వసూలు చేస్తున్నారు. అయితే ఆ మొత్తాన్ని మరో రూ.40 పెంచి రూ.50 వసూలుకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు ప్రతిపాదించాయి.ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం 200 యూనిట్ల విద్యుత్‌ను అర్హులకు ఉచితంగా ఇస్తోంది. ఇక 299 యూనిట్ల విద్యుత్ వాడే మధ్య తరగతి వారికి కూడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 300 యూనిట్లు దాటినవారిపైనే భారం వేయాలని డిస్కంలు ప్రతిపాదించాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.30 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 300 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులు కేవలం 20 శాతమే. వారిపై మాత్రమే భారం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. మిగతా 80 శాతం వినియోగదారులపై ఎలాంటి భారం ఉండదని డిస్కంలు చెబుతున్నాయి. డిస్కంల ప్రతిపాదనపై రాష్ట్రంలో కనీసం మూడుచోట్ల బహిరంగ చర్చ చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా అభిప్రాయ సేకరణ చేసిన తర్వాతనే చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత చార్జీల సవరణ అమలులోకి వస్తుంది. ఈ మొత్త ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం మూడు నెలలు పట్టే అవకాశం ఉంది.

# త్యాగధనుడు కొండాలక్ష్మణ్ బాపూజీ

- మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 21.:**

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు రాజారాంతో కలిసి విగ్రహానికి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడాతు క్విట్ ఇండియా పోరాటం, ముల్కీ ఆందోళన, తెలంగాణ ఉద్యమం తదితర వాటిలో తనదైన పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తు చేశారు. నిజాం వ్యతిరేక, తొలి, మలి దశ ఉద్యమాల్లో బాపూజీ పోరాటం స్ఫూర్తి దాయకమని అన్నారు. అతి సామాన్య కుటుంబం నుండి ఎదిగిన మహోన్నత వ్యక్తిత్వం బాపూజీదని , వెనకబడిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడని వారు కొనియాడారు. నాటి ఉద్యమ కారులకు అండగా న్యాయ సహాయం అందించారని, మలిదశ పోరాటానికి వేదికగా తన ఇల్లు జలదృశ్యాన్ని మలిచిన దీశాలని స్పష్టం చేశారు. అలాగే మూడు తరాల ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించగా , అలాగే అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా నిలచి బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా సర్వస్వం ధారబోసినట్లు చెప్పారు. తన జీవిత కాలం పేదల కోసమే తపించగా, ఆయన స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజారాం పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, నేతలు శ్రీనివాస్, బలరాం, సత్యనారాయణ, అజ్గర్, నేత నాగరాజు, ప్రేమ్ కుమార్, గుండు లక్ష్మణ్ పాల్గొన్నారు.





## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంతా పూర్ శ్రీనివాస పురంలో 77 లక్షలతో CC రోడ్డు, SWD పనులకు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఉప్పల్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటాను అని తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు సూరం శంకర్, పవన్, చంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## తుంకుంట మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షన్

- స్వచ్ఛత హి కార్యక్రమంపై అవగాహన ర్యాలీ



**జయభేరి, సెప్టెంబర్ 21:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు, స్వయం సహాయక బృందం సభ్యులు, పురపాలక సిబ్బంది కలిసి స్వచ్ఛత హి సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత మరియు మొక్కలు నాటే కార్యక్రమంపై అవగాహన చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. ప్రతీ ఒక్కరు భాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రేణుక రాజవెల్లి, అధికారులు కన్నేశ్వర్ రావు, కౌన్సిలర్ వేణుగోపాల్ ,శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

- మండల తహసీల్దార్ కు వినతి పత్రం.. మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి



**జయభేరి, సెప్టెంబర్ 21:**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబమైన బతుకమ్మ ఉత్సవాలు మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇందులో బాగంగా శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు గాను తగు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గ్రామ మాజి సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అలియాబాద్ గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ గా ఉన్న తహసిల్దార్ యాదగిరి రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆడపడుచులు నిర్వహించుకునే బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా రామాలయం వద్దకు బతుకమ్మలు తీసుకువెళ్ళడానికి రహదారి గుండా విధి దీపాలు, అదేవిధంగా వాగులో ఉన్న చెత్త చెదారం తొలగించాని వారు విజ్ఞప్తి చేశారు. ఇక బతుకమ్మ పండగ నాడు డిజె సౌండ్ కు అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా దసరా నాడు సబ్ స్టేషన్ నుండి జంబి వరకు లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటి డైరెక్టర్ కంఠం నరేందర్ రెడ్డి, కనికల లింగం బాల్ రెడ్డీ, బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి ముందుకు వచ్చిన దాతలు

- శివాలయంలో దేవతామూర్తులు, ధ్వజ స్థంభం ప్రతిష్ఠాపనకు భూమి పూజ



**జయభేరి, సెప్టెంబర్ 21:**

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం అద్రాస్ పల్లి గ్రామంలోని శివాలయంలో నవగ్రహా, విగ్నేశ్వరుడు, ఆంజనేయ స్వామి, ధ్వజ స్థంభం ప్రతిష్టాపనకు భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన అది మణెమ్మ కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి విగ్రహాలకు తమ వంతు సహకారం అందించారు. అదే విధంగా గజ స్థంభ ప్రతిష్టాపనకు ముగ్గురు దాతలు సహకారం అందించారు. ఆలయాల అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు లలిత నర్సింహా, యాదగిరి, ఆలయ చైర్మన్ ఆది అజయ్ కుమార్, దొండ మహేష్, దుర్గప్రసాద్, నర్సింహా, సంజీవ, పొన్నయా, దయాకర్, రాజు గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## కూలిపోతాదన్న కాళేశ్వరం ఎట్లుంది

- కొండపోచమ్మ,మల్లన్న సాగర్ లు సజీవ సాక్షాలు కావా!
- నువ్వు చెరిపితే చెరిగేది కాదు కేసీఆర్-హరీష్ రావుల చరిత్ర!
- మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి.

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 21:**

దేశంలోనే ఎవరూ చేయని విధంగా సాహసోపేతంతో తక్కువ సమయంలో 135 మీటర్ల ఎత్తు కాలేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి తెలంగాణ రైతులకు ప్రజలకు నీళ్లు అందించిన మహా నాయకులు కేసిఆర్ హరీష్ రావులని మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి కెసిఆర్,హరీష్ రావుల మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడని కాలేశ్వరం ప్రాజెక్టు ఉత్తదేనని అది కూలిపోయిందని అంటిర్రి మల్ల కాలేశ్వరం లేకుంటే మల్లన్న సాగర్లోకి నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తన వక్రబుద్ధిని మార్చుకోవాలని నువ్వు చెరిపే ప్రయత్నం చేస్తే చెరగనిదని సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డ కాలేశ్వరం చరిత్రను ఎవరు చేరుపలేరని అది సజీవ సాక్షాలుగా ఉంటాయని తెలిపారు. తెలంగాణ రైతులకు ప్రజలకు పెద్ద అన్నలుగా కేసీఆర్ హరీష్ రావులు నిలిచి రేయింబవులు కష్టించి ఈ ప్రాజెక్టులు నిర్మాణం చేశారని చెప్పారు.ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు మహిళలకు 2500 రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతులు పండించిన పంటకు మద్దతు ధరతో పాటుగా బోనస్ ఇవన్నీ ఏమైనాయని ముఖ్యమంత్రిని మీడియా ముఖంగా అడుగుతున్నామని హెగ్దేవ చేశారు.

## అబద్ధపు ప్రచారాలు మానండి

- గజ్వేల్లో పులి తిరగడం అవాస్తవం
- గజ్వేల్ సిఐ సైదా




**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 21 :**

పులి సంచరిస్తున్నట్లు యూట్యూబ్ ఛానల్ ద్వారా వైరల్ చేయడం జరుగుతుంది గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా పెట్రోల్ పంపు పరిసర ప్రాంతాలకు వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. ఎక్కడో సంచరించిన వీడియోను తీసుకొని గజ్వేల్ లో సంచరిస్తున్నట్లు తప్పుడు ప్రచారం జరుగుతుంది. ఇలాంటి వీడియోలు మీకు ఎవరైనా పంపిస్తే ఫార్వర్డ్ చేయకండి, గజ్వేల్ పట్టణ ప్రజలకు మరియు వాహనదారులకు గజ్వేల్ పట్టణ పరిసర ప్రాంతాలలో ఎక్కడ ఎలాంటి పులి సంచరించడం లేదు ఇలాంటి వార్తలు నమ్మవద్దని గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇగ్ నైట్ వింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక శోభాయాత్ర

**జయభేరి, సెప్టెంబర్ 21:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవర యాంజాల్ లో ఇగ్ నైట్ వింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు.నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేష్ శోభాయాత్ర, నిమర్జనం కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వినాయకుని కృపా కటాక్షాలతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు పెండం లక్ష్మీనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పిన్నింటి ధర్మారెడ్డి, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట జగదీశ్ గౌడ్ నాయకులు రంగప్పగారి నాగరాజు గౌడ్, మేటె బాలయ్య,గంధం పాండు గౌడ్, మిర్యాలకర్ సాయి కుమార్ గార్లు,ఇగ్ నైట్ వింగ్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

- మజీద్ పూర్ గ్రామంలో స్వచ్ఛత హి కార్యక్రమం

**జయభేరి, సెప్టెంబర్ 21:**

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శామీర్ పేట ఎంపిడివో మమతాబాయి సూచించారు . మజీద్ పూర్ లోని గ్రామ పంచాయితీలో స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా తడిచెత్త, పొడి చెత్త కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఐజయ్య, మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ పాల్గోన్నారు. ఆనంతరం వారు మాట్లాడుతూ దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి చేతి సంచులను వాడాలని సూచించారు. అదేవిధంగా తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయితీ సిబ్బందికి అందించాలన్నారు. ఇక పరిసరాలను ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వేణుగోపాల్, బిల్ కలెక్టర్ వీరేష్ , మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.




## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఏకగ్రీవం

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 21 :**

వర్గల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా బ్రహ్మాండ్లపల్లి వెంకటయ్య గుప్త ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం వర్గల్ లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ నేతలు హరినాథ్ గుప్త, రంగయ్య గుప్త హాజరయ్యారు. అయితే మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా వెంకటయ్యను ప్రతిపాదిస్తూ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు మహాసభ ప్రతినిధులు హరినాథ్ గుప్త, రంగయ్య గుప్తలు ఆయనను అభినందిస్తూ నియామక పత్రం అందజేశారు. అనంతరం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా త్వరలోనే ప్రమాణ స్వీకార మహోత్సవం ఉంటుందని అధ్యక్షునిగా ఎన్నికైన వెంకటయ్య గుప్త స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి మూడోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉండగా, సంఘ ప్రతిష్ట, బలోపేతం దిశగా తన వంతు కృషి చేస్తానని వివరించారు.



# పాఠశాల పై విచారణ జరిపి.. వివరణ ఇచ్చిన ఎంఈఓ మాతృ నాయక్

- విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి విచారణ జరిపిన ఎంఈఓ

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విచారించమని జిల్లా విద్యాధికారి ఆదేశించగా దేవరకొండ విద్యాధికారి మాతృ నాయక్ శనివారం విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఎంఈఓ మాతృనాయక్ లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ ప్రవేటు పాఠశాలలో శుక్రవారం సాయంత్రం పాఠశాల యాజమాన్యం ఫీజు పే చేయలేదని ఇద్దరు విద్యార్థినిలను పాఠశాలలో ఉంచిన అంశంపై శనివారం లిటిల్ ఫ్లవర్ పాఠశాలను సందర్శించారని తెలిపారు. పాఠశాలలో ఉన్న యూకేజీ, ఎల్ కే జి మరియు 6,7 తరగతుల విద్యార్థులకు





పాఠశాల యాజమాన్యం ఫీజుల గురించి మిమ్మల్ని ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అడగగా విద్యార్థిని విద్యార్థులు ఫీజుల ప్రస్తావన మా తల్లిదండ్రులకు మాత్రమే తెలుసని, ఉపాధ్యాయులు మా వద్ద ఎటువంటి ఫీజుల ప్రస్తావన తీసుకురారని, కేవలం మా తల్లిదండ్రులకే టీ సి ఫోన్ చేసి ఫీజు విషయాలు తెలియపరుస్తారని విద్యార్థులు తెలిపారనీ అన్నారు.శుక్రవారం సాయంత్రం పాఠశాలలో లేటుగా ఉంచిన విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులని వివరణ అడిగానని,వారే స్వయంగా ఇట్టి సంఘటన తప్పుగా అర్థం చేసుకున్నామని తెలిపి రాతపూర్వకంగా వివరణ ఇచ్చారని తెలిపారు. ఇట్టి అంశం పై పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ ను కూడా వివరణ కొరగా విద్యార్థులకు పాఠశాల ఫీజు విషయాలు అడగలేదని, విద్యార్థులకు నిర్బంధించలేదని, ఫీజు విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే సమాచారం తెలియపరుస్తామని పేర్కొన్నారు.విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పాఠశాల యాజమాన్యం రాతపూర్వకంగా ఇచ్చినటువంటి వివరణ ఆధారంగా నా యొక్క విచారణ రిపోర్టును జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించానని ఎంఈఓ మాతృ నాయక్ తెలిపారు.

## దేవరకొండ పట్టణ పరిశుభ్రత లక్ష్యంగా స్వచ్ఛత హి సేవ

- మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పరిశుభ్రత లక్ష్యంగా స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. దేశంలో స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవా 2024 కార్యక్రమంలో భాగంగా శనివారం దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో SPR పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ గారు మాట్లాడుతూ పట్టణం స్వచ్ఛతలో ప్రజల సామూహిక భాగస్వామ్యం అవసరమని మున్సిపాలిటీ ప్రజలు తమ కాలనీలలో పరిశుభ్రతను పాటించాలని తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త తీసుకెళ్లే మునిసిపాలిటీ స్వచ్ఛ వాహనాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పిఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేష్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రమావత్ సక్కు మున్సిపల్ వార్డు అధికారులు మరియు స్కూల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ తెలంగాణతో పెరిగిన రేవంత్ ఇమేజ్

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 21:**




యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను చాలా ప్రెస్టేజియస్‌గా తీసుకొస్తోంది. ఇప్పటికే ఈ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాతో పాటు చాలా మంది ఇండస్ట్రియలిస్ట్‌లు, హైయ్యర్ అఫిషియల్స్ పాల్గొన్నారు. కాబట్టి.. త్వరలోనే తెలంగాణ స్కిల్ హబ్‌గా మారుతుందనడంలో ఎలాంటి అనుమానం లేదు. ఎందుకంటే ప్రభుత్వం చాలా కాన్ఫిడెంట్‌గా వేస్తున్న అడుగులే దానికి సాక్ష్యం.ఇది పోటీ ప్రపంచం.. సత్తా ఉన్నవారే నెగ్గుకురాగలరు.. గెలవగలరు.. నిలవగలరు. ప్రస్తుతం చాలా మంది స్టూడెంట్స్ కాలేజీ నుంచి బయటికి వస్తున్నారు. కానీ వారికి సరైన స్కిల్స్ లేకపోవడంతో మళ్లీ కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అందుకే ప్రస్తుతం మార్కెట్‌కు అవసరమైన స్కిల్స్ ఏంటో వాటిపై మాత్రమే ట్రైనింగ్ ఇచ్చి జాబ్స్ సాధించే సత్తాను పెంచనున్నారు. నిజానికి ఈ స్కిల్ యూనివర్సిటీ సీఎం రేవంత్ రెడ్డి బ్రెయిన్ చైల్డ్. ఇప్పటికే ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు 150 ఎకరాల భూమిని కేటాయించారు. వందకోట్ల రూపాయల నిధులను కూడా అందించేందుకు నిర్ణయించారు. అంతేకాదు ఈ దసరా నుంచి మొదలు కానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి.ఈ యూనివర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా, కో ఛైర్మన్‌గా శ్రీనివాస సి.రాజు ఉన్నారు. ఇప్పటికే ఆరు కోర్సులను కూడా డిజైన్ చేశారు. మొత్తం 140 కంపెనీలు ఇందులో ఇంప్లీడ్ అవుతున్నాయి. ఈకామర్స్, లాజిస్టిక్స్ రిటైల్‌లో సర్టిఫికేట్, డిప్లొమా కోర్సులను స్టార్ట్ చేయనున్నారు. వీటిల్లో ట్రైనింగ్ ఇచ్చేందుకు SBI, న్యాక్, డాక్టర్ రెడ్డీస్, TVAGA, అదానీ, సీఐఐ లాంటి సంస్థలు రెడీ అవుతున్నాయి. ఇవన్నీ బోర్డు మీటింగ్‌లో డిసైడ్ చేశారు. అంతేకాదు యూనివర్సిటీ కంప్లీట్ మెయింటనెన్స్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడానికి ఇండస్ట్రియలిస్ట్‌లను రిక్వెస్ట్ చేశారు రేవంత్.పబ్లిక్, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ఈ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటవుతోంది. ఇది ఇండిపెండెంట్‌గా పనిచేయనుంది. ఇందులో మూడు నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సులతో పాటు.. 3 నుంచి 4 నెలల వ్యవధి నుంచి ఏడాది పాటు డిప్లమా కోర్సులు కూడా ఉంటాయి. ఫస్ట్ ఇయర్‌లో 2 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా త్వరగా ఈ నెంబర్‌ను 20 వేలకు తీసుకెళ్లాలనేది ప్లాన్. ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్. ఈకామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్..గేమింగ్ అండ్ కామిక్స్ ఇలా ప్రతి ఒక్క రంగంలో కోర్సు ఉంటుంది. ఈ కోర్స్‌లో ఆ రంగంలో ప్రముఖంగా కంపెనీలతో అవగాహన ఒప్పందం ఉంటుంది. అంటే స్కిల్ నేర్చుకుంటే చాలు.. జాబ్ గ్యారెంటీ అన్నమాట.నిజానికి ఈ యూనివర్సిటీ ఏర్పాటు అటు యువతకు, ఇటు ఇండస్ట్రీస్‌కు విన్ విన్ పరిస్థితి లాంటిది. ఎందుకంటే ఇండస్ట్రీల అవసరాలకు అనుగుణంగా వారు ట్రైనింగ్ అండ్ సిలబస్‌ను డిజైన్ చేసుకోవచ్చు. డిమాండ్ ఉన్న రంగాలపైనే మొదట ఫోకస్ చేస్తున్నారు. ముఖ్యంగా ఫార్మాలో ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉండటంతో.. ఆ తరహా కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండేలా డిజైన్ చేస్తున్నారు.మరి స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన మాత్రమే జరిగింది. మరి ఇప్పటికిప్పుడు క్యాంపస్ ఎలా? దీనికి సొల్యూషన్ ఏంటి? అయితే టెంపరరీగా కొన్ని క్యాంపస్‌లను సెలెక్ట్ చేసి అందులో క్లాస్‌లను నిర్వహించాలని డిసైడ్ అయ్యారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ క్యాంపస్.. న్యాక్ క్యాంపస్.. ఇలా కొన్నింటిని శాటిలైట్ క్యాంపస్‌లుగా ఏర్పాటు చేయాలని డిసైడ్ అయ్యారు. కాబట్టి.. ఈ విజయదశమికి కోర్సులు ప్రారంభం కావడం ఖాయం. ఫస్ట్ బ్యాచ్‌కు సంబంధించిన క్లాస్‌లు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి. మొత్తానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నుంచి త్వరలోనే దేశానికి కావాల్సిన స్కిల్డ్ ఎంప్లాయిస్ తయారు కానున్నారు.




## పిర్జాదిగూడలో స్వచతా హిసేవ ప్రోగ్రామ్

**జయభేరి, మేడిపల్లి :**

"స్వచ్ఛతా హిసేవ 2024"కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం పిర్జాదిగూడ నగరపాలక సంస్థలోని 16వ డివిజన్ లోని SFS స్కూల్ లో పిర్జాదిగూడ యందు ప్రజలకు చెత్తను వేరుచేయుటపై (తడి, పొడి, హానికర) అవగాహన ప్రోగ్రామ్ లో పాల్గొన్న పిర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్. అనంతరం SFS స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు కూడా చెత్త సేకరణపై అవగాహన కల్పించి అనంతరం విద్యార్థిని, విద్యార్థుల చేత స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించి పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటిన మేయర్ అమర్ సింగ్, 16వ డివిజన్ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్, మున్సిపల్ RO శ్రీనివాస్ రెడ్డి. పిర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్, మున్సిపల్ RO శ్రీనివాస్ రెడ్డి, SFS స్కూల్ యజమాన్యం, శానిటరీ సిబ్బంది మరియు వార్డ్ ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ పన్నెండవ వర్ధంతి



**జయభేరి, కరీంనగర్ :**

నగరంలోని సిరిసిల్ల బైపాస్ రోడ్ లో గల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నేడు వారి 12వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం శ్రీరాములు ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోప రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోలు సత్యనారాయణ, సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ NPDCL కరీంనగర్ వడ్లకొండ గంగాధర్ హాజరై ఆచార్య కొండా లక్షణ్ బాపూజీ విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించినారు. తను స్వాసంత్ర సమరయోధులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు మంత్రి పదవినే వదులుకొన్న గొప్ప త్యాగశీలి తెలంగాణ రావడానికి ఎంతో కృషి చేసినారు తెలంగాణ రాష్ట్రము రావడానికి ముఖ్యులు తన ఆశయాలను కొనస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎనందుల సత్యనారాయణ, మోర రాజేశం, వంగర ఆంజనేయులు, గజవెల్లి కనకయ్య,తేల్ల చెంద్రశేఖర్, ఎలిగేటి శ్రీనివాస్, కొక్కుల గోవర్ధన్, బొల్లి రవి, బొల్లబత్తిని రవిందర్, వెనగంటి సందీప్, వనమాల చెంద్రశేఖర్, జక్కని శ్రీధర్, తదితరులు హాజరై నివాళులు అర్పించినారు.

## ఆసుపత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన

- అభయ బిబిసి హాస్పిటల్లో డాక్టర్ల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి
- సంఘటన స్థలానికి చేరుకున్న నల్లకుంట పోలీసులు



**జయభేరి, హైదరాబాద్ :**

తిలక్ నగర్ అభయ బిబిసి హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఏడాదిన్నర వయసున్న చిన్నారి ఆరాధ్య మృతి చెందిందని ఆరోపిస్తూ బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. అలీ కేఫ్ చౌరస్తా ప్రాంతానికి చెందిన ప్రశాంత్, శైలజ దంపతుల కుమార్తె ఆరాధ్య గత రెండు రోజులుగా జ్వరం దగ్గు జలుబుతో బాధపడుతుంది. దీంతో తల్లిదండ్రులు చే నంబర్ లోని యశోద కృష్ణవేణి ఆస్పత్రి వైద్యుడు ప్రేమ్ కుమార్ వద్దకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అయితే ఆయన తిలక్ నగర్ లోని అభయ బీబీసీ ఆసుపత్రికి తీసుకెళ్లమని రిఫర్ చేశారు. దీంతో శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆరాధ్యను తల్లిదండ్రులు అభయ బిబిసి ఆసుపత్రికి తీసుకొని వచ్చారు. అయితే ముందు డబ్బులు కట్టండి ఆ తర్వాతే చికిత్స చేస్తామని ఇక్కడి వైద్యులు చెప్పడంతో తండ్రి ప్రశాంత్ 15000 అడ్వాన్స్ చెల్లించాడు. డబ్బులు కట్టిన తర్వాత చికిత్స ఆలస్యం చేయడంతో చిన్నారి ఆరాధ్య పరిస్థితి విషమించి ఆసుపత్రిలో మృతి చెందినది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు అభయ బిబిసి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు మృతి చెందిందని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. తమ కూతురి మరణానికి కారణమైన వైద్యులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. దీంతో అభయాసుపత్రి యజమాన్యం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ జగదీశ్వర్ రావు, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు.



## సంక్షేమ వసతిగృహాల పనితీరు మెరుగుపడాలి

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నియోజక వర్గంలో ఉన్న సంక్షేమ వసతి గృహాలు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరుపై శనివారం ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజక వర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమీక్ష సమావేశం నిర్వహించచారు.వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. గడిచిన మూడేండ్ల నుంచి పదో తరగతి పరీక్షల్లో సాధించిన ఉత్తీర్ణత శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.మండల ప్రత్యేకాధికారులు హాస్టళ్లను తనిఖీ చేసిన సమయంలో గమనించిన లోటుపాట్లను ప్రస్తావిస్తూ వాటిని చక్కదిద్దుకోవాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యాబోధన, సరైన వసతి సదుపాయాలను కల్పించాలన్నారు. ఆకస్మిక తనిఖీ చేపట్టి ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్. సి. ఓ లు,ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

## వీరమళ్ళ నర్సింహ మృతి బాధాకరం

- నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని 19వ వార్డుకు చెందిన వీరమళ్ళ నర్సింహ మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శనివారం దేవరకొండ పట్టణంలో నర్సింహ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింహ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......నర్సింహ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## కొరడా ఝులిపించిన కంటోన్మెంట్ అధికారులు

**జయభేరి, సికింద్రాబాద్:**

బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోయిన్ పల్లి చెక్పోస్ట్ నుండి సుచిత్ర వరకు (నాగపూర్ హై వే) రహదారి ఇరువైపులా వెలసిన అక్రమ వ్యాపార సముదాయాలపై ఎట్టకేలకు కంటోన్మెంట్ బోర్డు అధికారులు కొరడా ఝులిపించారు. ఫుట్పాత్, రక్షణ శాఖ భూములలో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు సాగించడమే కాకుండా ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగిస్తున్నారని వచ్చిన అనేక పిర్యాదులతో చర్యలకు పూనుకున్నట్లు సానిటరీ సూపరింటెండెంట్ దేవేందర్ తెలిపారు. తొలగించిన వాటిలో పండ్ల దుకాణాలు, నర్సరీలు, గృహోపకర వస్తువుల దుకాణాలు ఉన్నాయి. ఫుట్ పాత్ లను ఆక్రమించడమే కాకుండా రోడ్డు పైనే వాహనాలు నిలిపి రోడ్డు ప్రమాదాలకు కూడా కారణమౌతున్నట్లు పేర్కొన్నారు. మళ్ళీ వ్యాపారాలు మొదలి పెడితే మరింతా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.




# ఇంగ్లాండు రాణి అందచందం



శ్రీవిష్ణు, రీతూవర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'శ్వాగ్'. హసిత్‌గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని వేగవంతం చేశారు. శనివారం 'ఇంగ్లాండు రాణి..' అంటూ సాగే మూడో గీతాన్ని విడుదల చేశారు. వివేక్‌సాగర్ స్వరపరచిన ఈ గీతాన్ని స్వరూప్ గోలి రచించారు. కైలాష్‌ఖేర్ ఆలపించారు. ఈ పాటలో కథానాయిక రీతూవర్మ లుక్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిదని, శ్రీవిష్ణు నాలుగు గెటప్స్‌లో కనిపిస్తారని, నాయిక రీతూవర్మ మహారాణి పాత్రలో అలరిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. మీరా జాస్మిన్, దక్ష నగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, రచనదర్శకత్వం: హసిత్ గోలి.

# ఆ బాధ్యత వారిదే!

మహిళల పట్ల అకృత్యాలు, లైంగిక వేధింపులు.. సినిమా ఇండస్ట్రీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆ వుడ్, ఈ వుడ్ అని కాదు.. ఇప్పుడు అన్ని భాషల చిత్ర పరిశ్రమల్లోనూ ఈ తరహా ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్ నటి కృతిక కమ్రా సోషల్‌మీడియా వేదికగా ఓ విజ్ఞప్తి చేశారు. పరిశ్రమను కుదిపేస్తున్న క్యాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు లాంటి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత.. పరిశ్రమలోని మగవాళ్లదేనని చెప్పారు. ముందుగా వారివారి సినిమా షూటింగ్స్‌పై దృష్టి పెట్టాలనీ, అందులో పాల్గొంటున్న మహిళల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు. మహిళా నటులు, ఇతర సాంకేతిక సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాకబు చేసి.. కావాల్సిన సాయం అందించాలన్నారు. పని ప్రదేశం ప్రొఫెషనల్‌గా ఉండేలా చూసుకోవాలనీ, షూటింగ్ స్పాట్ల దగ్గర ఇష్టారీతిన మాట్లాడటం, మహిళలపై అసభ్యకరమైన జోకులు వేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'ఒకరిని పొగడటానికి.. వారిని ఆక్షేపించడానికి మధ్య ఎంతో తేడా ఉంది. ఆ హద్దును దాటకుండా.. మహిళలతో మాట్లాడగలిగితేనే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది' అని చెప్పారు కృతిక. టెలివిజన్, ఓటీటీ షోల ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది కృతిక. హుష్ హుష్ మొదలుకొని బొంబై మేరీ జాన్ వరకు.. వైవిధ్యమైన పాత్రల ద్వారా తన నటనా నైపుణ్యాన్ని నిరూపించుకున్నది.





# థగ్‌లైఫ్‌కు గుమ్మడికాయ కొట్టేశారు

కమల్‌హాసన్, మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన క్లాసిక్ 'నాయకుడు' వచ్చి అక్షరాలా 37ఏండ్లు. మళ్లీ ఇన్నాళ్లకు కమల్, మణిరత్నం కలిసి పనిచేస్తున్నారు అనగానే 'థగ్‌లైఫ్' సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అందుకు తగ్గట్టుగానే మణిరత్నం పీరియాడిక్ డ్రామాను ఎంచుకున్నారు. అంతేకాదు, మణిరత్నం ఈ సినిమా షూటింగ్‌ని త్వరగా కంప్లీట్ చేశారు. ఇంత త్వరగా మణిరత్నం షూటింగ్ పూర్తి చేయడం 'థగ్‌లైఫ్' విషయంలోనే జరిగిందని కోలీవుడ్‌లో పలువురు అభిప్రాయపడుతున్నారు. త్రిష ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది చివర్లో కానీ, వచ్చే ఏడాది మొదట్లో కానీ 'థగ్‌లైఫ్'ని విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన సందర్భంగా సుహాసిని మణిరత్నం ఓ ఫొటోను తన ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేశారు. ఇదిలావుంటే.. ప్రతిష్టాత్మక నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమా ఓటీటీ హక్కులను 150కోట్లకు సొంతం చేసుకున్నది. ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న విషయం విదితమే.

# మూడింటినీ సమాంతరంగా

ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు లారెన్స్ కెరీర్ పరంగా జోరు పెంచారు. ప్రస్తుతం మూడు సినిమాలతో బిజీగా ఉన్నారాయన. ఈ మూడింటినీ సమాంతరంగా పూర్తిచేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నారట లారెన్స్. వాటిలో 'బెంజ్' చిత్రం చిత్రీకరణ దశలో ఉండగా, ఇటీవలే ప్రకటించిన రమేష్‌వర్మ చిత్రం షూటింగ్ త్వరలోనే మొదలుకానుంది. ఇంకోవైపు 'కాంచన 4'కి సంబంధించిన కసరత్తులు ముమ్మరం చేశారు. ఇప్పటివరకూ 'కాంచన' ఫ్రాంచైజీ దక్షిణాది ప్రేక్షకుల్ని మాత్రమే అలరించింది. ఈ నాలుగో భాగం మాత్రం పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కించనున్నారట లారెన్స్. ఇందులో కథ రీత్యా ముగ్గురు హీరోయిన్లు ఉంటారట. వారిలో ఓ పాత్రకు బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్‌ని అనుకుంటున్నారట. 'స్త్రీ 2'తో 800కోట్ల విజయాన్ని ఖాతాలో వేసుకొని ఫుల్ జోష్‌మీద ఉన్నది శ్రద్ధాకపూర్. 'కాంచన 4' కూడా కామెడీ హారర్ సినిమానే కావడంతో ఇందులో నటించేందుకు శ్రద్ధా ఉత్సాహం చూపిస్తున్నారట. మిగతా ఇద్దరు దక్షిణాది హీరోయిన్లే ఉంటారని తెలుస్తున్నది. త్వరలోనే 'కాంచన 4' పట్టాలెక్కనుంది. ఈ మూడు షూటింగ్‌లూ సమాంతరంగా జరుగనున్నాయి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com